సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 2 । ఫిబ్రవరి । 2024



15 కిలోల గంజాయి పట్టివేత
గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కొర్లపహాడ్ టోల్‌ప్లాజా బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. - IIలో



బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి
కేంద్రం అవలంబిస్తున్న మతతత్వ విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. - IIలో



బైక్‌ల దొంగ అరెస్ట్
బైక్‌ల చోరీకి పాల్పడుతున్న దొంగను గురువారం కోదాడ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. - IIలో

ఆశ.. నిరాశ!



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యం
- పీఎం ఆవాస్ యోజన కింద పేదలకు మేలు
- ఉమ్మడి జిల్లాలో రెండు రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు
- పన్ను మినహాయింపు పరిమితి పెంపు లేక వేతన జీవుల్లో నిరాశ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పేదలకు, మధ్య తరగతి వర్గాల వారికి పెద్దగా ప్రయోజనం లేదని, కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి వరకు చేసిన పథకాలు చెబుతున్నారు తప్ప పెద్దగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. వేతన జీవులకు పన్ను మినహాయింపు పరిమితిని పెంచకపోవడంతో వారిలో నిరాశ వ్యక్తమవుతోంది. ఉచిత బియ్యం పంపిణీ కొనసాగింపు, ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటించడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

పీఎం ఆవాస్ యోజన



కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పీఎం ఆవాస్ యోజన కింద 2 కోట్ల మంది పేదలకు ఇళ్లు కట్టిస్తామని ప్రకటించింది. దీని ద్వారా ఇళ్లు లేని పేదలకు కొంత మేలు జరిగే అవకాశం ఉంది. ఒక్కో లబ్ధిదారునికి రూ.2.65 లక్షలు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందనుంది. అయితే, బ్యాంకులో రుణాలు పొంది ఇల్లు కట్టుకున్న వారికి మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుంది. ఉమ్మడి జిల్లాలో రుణాలు పొంది ఇళ్లు కట్టుకున్న దాదాపు 5 లక్షల కుటుంబాలకు వారికి ఈ పథకం వర్తించనుంది.

సోలార్ విద్యుత్‌తో లబ్ధి



సోలార్ విద్యుత్ ద్వారా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని కేంద్రం ప్రకటించింది. సూర్యోదయ యోజన కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని ఈ పథకంలో చేరితే ఈ ఉచిత విద్యుత్తు వర్తిస్తుందని ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు 12 లక్షల మంది గృహ వినియోగదారుల్లో నెలకు 300 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వారికి ఏటా రూ.15వేల నుంచి రూ.18 వేల వరకు ఆదా కానుంది.

పాడి పరిశ్రమకు ప్రోత్సాహం



కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చింది. తద్వారా వ్యవసాయ రంగంతో పాటు అనుబంధ రంగాలకు కూడా మేలు జరగనుంది. వ్యవసాయ రంగంపై నల్లగొండ జిల్లాలో 9.50 లక్షల మంది ఆధారపడి ఉన్నారు. వారికి మేలు చేకూరనుంది. పశు పోషణ, మత్స్య, పాడి పరిశ్రమలకు రుణాలు పెరుగనున్నాయి. స్వల్ప కాలిక పంట రుణాలను తక్కువ వడ్డీలకు అందించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 3.50 లక్షల మంది పాడి రైతులకు ఆర్థికంగా మేలు జరిగే అవకాశం ఉంది.

ఉపాధి హామీకి భరోసా



ఉపాధి హామీ పథకంలో 86 వేల కోట్లు కేటాయించడంతో నల్లగొండ జిల్లాలో దాదాపు 4 లక్షల కుటుంబాలకు మేలు జరగనుంది. సూర్యాపేట జిల్లాలో పథకంలో కూలీలుగా ఉన్న 2.72 లక్షల కుటుంబాలకు చెందిన 6.32 లక్షల మందికి పని దొరికే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపట్టే పనులకు నిధులు సమకూరే అవకాశం ఉంది.

గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం



నల్లగొండ రూరల్: బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధిని పెంచేలా నిధులు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధిని సాధించడానికి బడ్జెట్‌లో లెక్కలు చూపారు. సోలార్, పవర్ గ్రిడ్ కోసం నిధులు కేటాయించడం ద్వారా పునరుత్పాదక వనరుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడం మంచి ప్రయోజనమే. జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ కింద తగిన నిధులు కేటాయించడం ఎలక్ట్రికల్ వాహన రంగాన్ని మరింత అభివృద్ధిచేసేలా ప్రోత్సహించింది.

– పాందరయ్య, అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఎంజీ యూనివర్సిటీ

ఎన్నికల తాయిలాలు లేవు



నల్లగొండ రూరల్: బడ్జెట్‌లో ఎన్నికల తాయిలాలు లేవు. మూడేళ్లుగా ఎదురు చూస్తున్న ఉద్యోగుల పన్ను సవరణలో మార్పులు చేర్పులు లేకపోవడంతో వారికి నిరుత్సాహం కలిగించింది. ఉచిత రేషన్ బియ్యం కొనసాగించడం ఊరటనిచ్చింది. రైతుల కోసం కొత్తగా ఎలాంటి ప్రయోజనం కలిగించే బడ్జెట్ ప్రవేశ పెట్టలేదు. పెట్టుబడుల కోసం ప్రాధాన్యమిచ్చారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా చిన్న వ్యాపారులకు, చిన్న తరహా పరిశ్రమలకు రుణాలు ఇవ్వడం ఉపాధికి ప్రాధాన్యత ఇచ్చినట్లుంది.

–అంజిరెడ్డి, అర్థశాస్త్ర అధ్యాపకుడు, ఎంజీ యూనివర్సిటీ

రైల్వే ప్రాజెక్టుల్లో రెండింటికి కేటాయింపులు



బీబీనగర్ – గుంటూరు మధ్య రూ.2853 కోట్లతో చేపట్టే డబ్లింగ్ పనుల కోసం గత ఆర్థిక సంవత్సరం పైసా వెచ్చించని కేంద్రం ఈసారి రూ.200 కోట్లు కేటాయించింది. ఎంఎంటీఎస్ ఫేజ్–2లో భాగంగా ఘట్‌కేసర్ – రాయగిరి వరకు పొడిగింపు పనుల కోసం ఈ బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించింది. ఇక మాచర్ల – నల్లగొండ మధ్య 92 కిలో మీటర్ల కొత్త రైల్వే లైన్‌ను రూ.458.26 కోట్లతో మంజూరు చేసిన కేంద్రం గత బడ్జెట్‌లో రూ.35.35 కోట్లు కేటాయించింది. అందులో 11.30 లక్షలు ఖర్చు చేసింది. ఈసారి అది కూడా కేటాయించలేదు. విష్ణుపురం–జాన్‌పహాడ్ మధ్య 11 కిలోమీటర్ల రైల్వే లైన్‌కు రూ.82.67 కోట్లు కేటాయించినా పైసా ఇవ్వలేదు. ఈసారి అదీ కేటాయించ లేదు. జగ్గయ్యపేట– మేళ్ల చెరువు లైన్‌లో భాగంగా మేళ్లచెరువు– జాన్‌పహాడ్ లైన్‌కు రూ.175.91 కోట్లు కేటాయించినా అందులో రూ. 23.85 కోట్లు గతేడాది ఖర్చు చేసింది. ఈసారి ఏమీ కేటాయించ లేదు. నల్లగొండ–శ్రీరాంపురం 123వ బాక్స్ బ్రిడ్జి నిర్మాణానికి గతేడాది కేటాయించని రైల్వే శాఖ ఈసారి కూడా ఎలాంటి కేటాయింపులు జరుపలేదు. నల్లగొండ – తిప్పర్తి మధ్య అదనపు బాక్స్ బ్రిడ్జీల కోసం గత బడ్జెట్‌లో రూ.41.78 లక్షలు కేటాయించినా ఈసారి పైసా కేటాయించ లేదు.

అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఆయుష్మాన్ భారత్

అంగన్‌వాడీ, ఆశా వర్కర్లను ఆయుష్మాన్ భారత్ కిందకు తెస్తామనడంతో నల్లగొండ జిల్లాలో 2093మంది అంగన్‌వాడీలు, 1466 మంది ఆశావర్కర్లకు మేలు జరగనుంది. సూర్యాపేట జిల్లాలో1.035 మంది ఆశా వర్కర్లకు, 1210 మంది అంగన్‌వాడీలకు, యాదాద్రి జిల్లాలో 800 మంది ఆశావర్కర్లు, 901 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 860 టీచర్లు, 785 ఆయాలు పనిచేస్తున్నారు. వారందరికి ఆయుష్మాన్ భారత్‌లో ఆరోగ్య సేవలు రూ.5 లక్షల కవరేజీ అందనుంది.

మరో ఐదేళ్లు భారత్ రైస్

ఆహార భద్రత ద్వారా కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యం (భారత్ రైస్) పథకాన్ని కొనసాగిస్తామని చెప్పడంతో పేదలకు మరో ఐదేళ్లపాటు అందనున్నాయి. ఈ పథకాన్ని కొనసాగిస్తామని ప్రకటించింది. నల్లగొండ జిల్లాలో 4,62,465 కుంటుంబాలు, సూర్యాపేట జిల్లాలో 3.3 లక్షల కుటుంబాలు, యాదాద్రి జిల్లాలోని 2 లక్షల కుటుంబాలకు ఐదేళ్లపాటు లబ్ధి చేకూరనుంది. వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి రూ.1.27 లక్షల కోట్లు కేటాయింపుతో ఉమ్మడి జిల్లాలో పరోక్షంగా 16 లక్షల మంది రైతులకు ఎరువుల సబ్సిడీ, మద్దతు ధర రూపంతో లబ్ధి చేకూరనుండగా, దాదాపు 5లక్షల మంది రైతులకు పీఎం కిసాన్ యోజనతో లబ్ధి చేకూరనుంది.

ఎదుగు బొదుగు లేని బడ్జెట్



కోదాడ: కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ పూర్తి నిరాశాజనకంగా, ఎదుగు బొదుగు లేకుండా ఉంది. బడ్జెట్ ప్రతిపాదనలు 5 శాతం మాత్రమే పెంచారు. ఇది పెరిగిన ద్రవ్యోల్బనంతో సమానం. అందువల్ల బడ్జెట్‌లో ఏమాత్రం పెరుగుదల కనిపించలేదు. ఉపాధి హామీ, వ్యవసాయరంగానికి, ఎరువుల సబ్సిడీకి, గ్రామీణాభివృద్ధికి నిధులు తక్కువగా కేటాయించారు. బడ్జెట్‌లో 25 శాతం దాదాపు రూ.12 లక్షల కోట్లు వడ్డీలకు సరిపోతుంది. దీంతో సంక్షేమ పథకాల్లో కోత విధించే అవకాశం ఉంది.

– అందె సత్యం, ఆర్థిక విశ్లేషకుడు

న్యూస్‌రీల్

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు రూ.33.50 కోట్లు ఇవ్వండి

- కేంద్ర క్రీడా శాఖ మంత్రికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వినతి



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ : యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో నిర్మించతలపెట్టిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు రూ.33.50 కోట్లు కేటాయించాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌ను కోరారు. కోమటిరెడ్డి గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిశారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌ను అందించారు. ఖేలో ఇండియా పథకంలో భాగంగా నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరామని మంత్రి కోమటిరెడ్డి మీడియాకు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయా(ప్రతిభా కళాశాల)ల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ప్రవేశానికి ఫిబ్రవరి 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన గురుకులాల ఆర్‌సీఓ కె.లక్ష్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభా కళాశాలలల్లో ఇంటర్ చదువుతో పాటు ఐఐటీ, జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు tgwgurukulam.telangana, ttwreiscoe.cgg.gov.in వెబ్‌సైట్‌లో రూ.200 ఫీజు చెల్లించి అప్లయ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9021174434ను సంప్రదించాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం



నల్లగొండలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈఓ దస్రునాయక్

నల్లగొండ: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా పరీక్షలు కొనసాగాయి. మొత్తం 104 సెంటర్లలో సైన్స్ విభాగంలో సెకండియర్ విద్యార్థులు, ఒకేషనల్‌లో ఫస్టియర్ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ పరీక్షలు ఈనెల 15వ తేదీతో ముగియనున్నాయని డీఐఈఓ దస్రునాయక్ తెలిపారు.

పల్లె పాలనకు 329 మంది అధికారులు

- ముగిసిన సర్పంచ్‌ల పదవీ కాలం
- నేటి నుంచి పంచాయతీల్లో ప్రత్యేక పాలన
- గురువారం సాయంత్రమే బాధ్యతల స్వీకరణ
- ఒక్కొక్కరికి 2 నుంచి 3 గ్రామాలు అప్పగింత

నల్లగొండ: గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గురువారంతో ముగిసింది. పంచాయతీల పాలనకు ప్రభుత్వం 329 మంది ప్రత్యేక అధికారులను నియమిస్తూ జీఓ. 5ను విడుదల చేసింది. కలెక్టర్ హరిచందన ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం 5 గంటల తర్వాత అధికారులు బాధ్యతలు తీసుకున్నారు. వీరంతా శుక్రవారం విధుల్లో చేరనున్నారు.

గ్రామ పంచాయతీలు	844
సర్పంచ్ పదవులు ఖాళీగా ఉన్నవి	14
ఎన్నికలు జరగనివి	07



గురువారంతో పదవీకాలం ముగియడంతో సన్మానం పొందిన కనగల్ మండలం బుడుమర్లపల్లి పంచాయతీ పాలకవర్గం

అంతా గెజిటెడ్ స్థాయి అధికారులే..

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ప్రత్యేక అధికారుల పాలనకు ప్రభుత్వం గెజిటెడ్ స్థాయి అధికారులను నియమించింది. ఇందులో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, డీఈలు, ఏఈలు, ఏఓలు, ఎంపీఈఓలు, సూపరింటెండెంట్లు ఉన్నారు. ఒక్కో అధికారికి 2 నుంచి 3 పంచాయతీల బాధ్యతలు అప్పగించారు.

3న మంత్రితో వీడియో కాన్ఫరెన్స్

పంచాయతీల్లో బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు, కలెక్టర్లతో శనివారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై చర్చించనున్నారు. అనంతరం సోమవారం (5వ తేది) నల్లగొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ హరిచందన, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. అయితే జిల్లాలో నకిరేకల్ మండలంలో ఎన్నికలు జరగని ఏడు పంచాయతీలతోపాటు సర్పంచ్‌లు చనిపోవడం, ఇతర కారణాల వల్ల రాజీనామాలు చేసిన 14 పంచాయతీలతో కలిపి పదవులు ఖాళీగా ఉన్న మొత్తం 21 గ్రామాల్లోనూ ప్రత్యేక అధికానులను నియమించారు.

క్లుప్తంగా

ఆర్య సమాజ్ మందిరం వందేళ్ల పండుగ



మాట్లాడుతున్న విఠల్‌రావు ఆర్య

నల్లగొండ: నల్లగొండ ఆర్య సమాజ్ మందిరం ఏర్పడి మార్చి 1 నాటికి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆర్యసమాజ్ మందిరం ఆధ్వర్యంలో శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆర్య సమాజ్ మందిరం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య తెలిపారు. గురువారం నల్లగొండలోని ఆర్య సమాజ్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 1న నల్లగొండ ఆర్య సమాజ్ మందిరంలో శత జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతాని, సాయంత్రం కార్యక్రమాన్ని స్వామి ప్రమానంద సరస్వతి ప్రారంభిస్తారని తెలిపారు మార్చి 2న జరిగే సమావేశాలను స్వామి రామ్‌దేవ్‌బాబా ప్రారంభిస్తారని, 3వ రోజు జాతీయ నాయకులు గురుకుల విద్యార్థులు ముగింపు కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికిషన్, దాలంకార్, జిల్లా ఆర్యసమాజ్ అధ్యక్షులు బోయినపల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కోటయ్య, నాయకులు లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నేరేడుచర్ల: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఆటోనగర్‌లో గురువారం జరిగింది. ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆటోనగర్‌లో నివాసముంటున్న సైదాబీ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె భర్త గతంలోనే మృతిచెందగా.. ఒక కుమార్తె ఉంది. ఆమె కుమార్తె ఓ దుకాణంలో గుమాస్తాగా పనిచేస్తోంది. సైదాబీ రోజు మాదిరిగానే గురువారం ఉదయం ఇళ్లల్లో పనిచేసేందుకు వెళ్లగా, ఆమె కుమార్తె దుకాణానికి వెళ్లింది. వారి ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలోని రూ.8వేల నగదు, మూడు గ్రాముల బంగారుపు చెవి దిద్దులు, 7 తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన సైదాబీ ఇంట్లో జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్లం, పటిక పట్టివేత



బెల్లం, పటికను పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా

సూర్యాపేట క్రైం: రెండు ఆటోల్లో నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం, పటికను తరలిస్తుండగా పట్టుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట పట్టణంలోని పీఎస్‌ఆర్ సెంటర్, ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా రెండు ఆటోల్లో తరలిస్తున్న 6 క్వింటాళ్ల బెల్లం, 10కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. చివ్వెంల మండలం గుంజలూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి ఉపేందర్, సూర్యాపేట పట్టణంలోని అన్నాదురై నగర్‌కు చెందిన కోట నగేష్ హైదరాబాద్ నుంచి బెల్లం, పటిక తీసుకొచ్చి సూర్యాపేట చుట్టుపక్కల తండాల్లో అమ్ముతున్నట్లు ట్రైనీ ఐపీఎస్ రాజేష్ మీనా తెలిపారు. వీరిద్దరిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి బెల్లం, పటికలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

15 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- ఆర్టీసీ బస్సులో తరలిస్తుండగా పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూరింటెండెంట్ చాణిక్య, సిబ్బంది

నకిరేకల్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా బుధవారం రాత్రి జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నకిరేకల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి. చాణిక్య విలేకరులకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... మాదక ద్రవ్యాల తరలింపును అడ్డుకోవడంలో భాగంగా బుధవారం రాత్రి కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా ఎక్సైజ్ అధికారులు వాహనాలను తని ఖీ చేస్తుండగా.. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఇద్దరు వ్యక్తుల దగ్గర 15కిలోల గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా.. మహారాష్ట్రలోని అమరావతి ప్రాంతానికి చెందిన అన్వర్ హుస్సేన్, షేక్ షకీల్‌గా పోలీసులు గుర్తించారు. వారు ఒరిస్సా రాష్ట్రం నుంచి కిలో గంజాయి రూ.2200కు కొనుగోలు చేసి మహారాష్ట్రకు తీసుకెళ్లి కిలో రూ.10,000 విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. నిందితులిద్దరిని రిమాండ్ తరలించామని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలు రూ.1.50లక్షలు ఉంటుందన్నారు.ఈ విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సీఐ శేఖర్, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

యువతిపై అత్యాచారయత్నం

- సహకరించిన ఆమె చిన్నమ్మ
- పరారీలో నిందితుడు

మిర్యాలగూడ అర్బన్: కూతురు వరస అయిన యువతిపై ఓ వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడగా.. సదరు వ్యక్తికి ఆ యువతి చిన్నమ్మే సహకరించింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ టూటౌన్ ఎస్ఐ క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌లో చాంద్ సుల్తానా నివాసముంటోంది. ఆమె అక్క కూడా సమీపంలోనే భర్త, కుమార్తెతో కలిసి ఉంటుండగా.. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా కుమార్తెతో పాటు అక్క కూడా వచ్చి చాంద్ సుల్తానా వద్దే తలదాచుకుంటుంది. చాంద్ సుల్తానా మరిది ఆరిఫ్ భార్య కాపురానికి రాకపోవడంతో వారింట్లో తలదాచుకుంటున్న చాంద్ సుల్తానా అక్క కుమార్తెపై ఆరిఫ్ కన్నుపడింది. వరుసకు అతడికి కూతురు అయినా.. ఆ యువతిని పెళ్లి చేసుకుంటానని గత కొద్దిరోజులుగా వదిన చాంద్ సుల్తానాపై ఆరిఫ్ ఒత్తిడి తెచ్చేవాడు. అందుకు ఆ యువతి ఒప్పుకోకపోవడంతో ఎలాగైనా ఆమెను లొంగదీసుకోవాలని పథకం పన్నాడు. అందుకు వదిన చాంద్‌సుల్తానాను సహకారం అందించాలని ఆరిఫ్ కోరాడు. అందుకు చాంద్ సుల్తానా అంగీకరించి బుధవారం యువతి గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో ఆరిఫ్‌ను లోపలికి పంపించి తలుపు వేసింది. గదిలోకి వెళ్లిన ఆరిఫ్ యువతిపై అత్యాచారం చేయబోగా ఆమె అతడిని గట్టిగా కొరికింది. నొప్పి భరించలేక ఆరిఫ్ గట్టిగా అరవగా.. చాంద్ సుల్తానా తలుపులు తీయడంతో సదరు యువతి బయటకు పారిపోయింది. పోలీసులను ఆశ్రయిస్తుందన్న భయంతో సదరు యువతిని పట్టుకొచ్చి గదిలో రెండు రోజులు నిర్బంధించారు. బుధవారం రాత్రి చాంద్ సుల్తానా కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో నుంచి తప్పించుకున్న సదరు యువతి సమీపంలోనే నివాసముంటున్న తన తండ్రిని, నాయనమ్మను కలిసి జరిగిన విషయం వారికి చెప్పి బోరున విలపించింది. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆరిఫ్‌తో పాటు అతడి వదిన చాంద్ సుల్తానాపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆరిఫ్ పరారీ ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా ఆరిఫ్ గతంలో అధికార పార్టీ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడిగా పనిచేసినట్లు సమాచారం.

బాలుడి కిడ్నాప్ కేసులో నిందితుడికి జైలు

మిర్యాలగూడ టౌన్: బాలుడి కిడ్నాప్ కేసులో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం మిర్యాలగూడ కోర్టు రెండో అదనపు ఇన్‌చార్జి జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ. స్వర్ణలత తీర్పు వెలువరించారు. వివరాలు.. దామరచర్ల మండలం కొండ్రపోలు గ్రామానికి చెందిన రాసమళ్ల మేరీ–నాగేంద్రబాబు దంపతులకు కుమారుడు అక్షయ్, ఇద్దరు కుమార్తెలు సంతానం. 2023 జూన్ 9వ తేదీన కొండ్రపోలు గ్రామానికే చెందిన పట్టెటి వినోద్‌కుమార్ పాత గొడవలను మనసులో పెట్టుకొని రాసమల్ల అక్షయ్‌ని కిడ్నాప్ చేశాడు. కాగా అదేరోజు అక్షయ్ తల్లిదండ్రులు తన కుమారుడిని పట్టేటి వినోద్‌కుమార్ కిడ్నాప్ చేశాడని వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎం. రవికుమార్ నిందితుడిపై 365 సెక్షన్ కింద కిడ్నాప్ కేసు, 344 సెక్షన్ కింద 13 రోజుల పాటు బాలుడిని నిర్బంధించినందుకు గాను మరో కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. బుధవారం ఈ కేసు విచారణలో భాగంగా నిందితుడు పట్టెటి వినోద్‌కుమార్‌పై నేరం రుజువు కావడంతో కిడ్నాప్ కేసులో ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా, 13రోజుల పాటు బాలుడిని నిర్బంధించిన కేసులో మరో ఆరు నెలల పాటు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడు జరిమానా చెల్లించకుంటే మరో నెల పాటు జైలుశిక్షను పొడిగించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. దీపారాణి వాదించగా, ఆమెకు కోర్టు కానిస్టేబుల్ జానకి రాములు సహకరించారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

నూతనకల్: అనారోగ్య సమస్యలతో పాటు కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం గుడితండా గ్రామానికి చెందిన పాతులోతు శ్రీను(40) నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామ శివారులో వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టడానికని ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అతడి భార్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో గురువారం తెల్లవారుజామున పక్క పొలం రైతుకు ఫోన్ చేసి చెప్పింది. పక్క పొలం రైతు శ్రీను పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే అతడు పురుగుల మందు తాగి మృతిచెంది ఉండటం గమనించి కుటుంబ సభ్యులకు అందజేశాడు. మృతుడు గత రెండు సంవత్సరాల నుంచి కడుపు నొప్పి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని.. కడుపునొప్పి భరించలేకే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య పాతులోతు మైలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వావిల్‌కొల్ సర్పంచ్‌పై అనర్హత వేటు

డిండి: మండల పరిధిలోని వావిల్‌కొల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ దొంతినేని దామోదర్‌రావుపై దేవరకొండ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి రవీందర్ బుధవారం అనర్హత వేటు వేస్తూ తీర్పు వెలువరించినట్లు అదే గ్రామానికి చెందిన పేర్వాల జంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో వావిల్‌కొల్ గ్రామ సర్పంచ్‌గా పేర్వాల జంగారెడ్డి, దొంతినేని దామోదర్‌రావు బరిలో నిలువగా దామోదర్‌రావు సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. కాగా మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టడానికి గాను దామోదర్‌రావు అప్పటి ప్రభుత్వం నుంచి ఎన్నికలకు ముందే అగ్రిమెంట్ చేసుకున్నారని, దీంతో సర్పంచ్‌గా దామోదర్‌రావు అనర్హుడవుతాడని అదే సంవత్సరం జనవరి 23వ తేదీన పేర్వాల జంగారెడ్డి దేవరకొండ జూనియర్ సివిల్ కోర్టును ఆశ్రయించాడు. అప్పటి నుంచి కోర్టులో ఇరువురి తరఫున లాయర్లు వాదనలు వినిపిస్తూ వస్తున్నారు. బుధవారం ఈ కేసు తుది విచారణలో భాగంగా సాక్ష్యాధారాలను పరిశీలించిన జూనియర్ సివిల్ జడ్జి సర్పంచ్ పదవికి దామోదర్‌రావు అనర్హుడని తీర్పు వెలువరించినట్లు పేర్వాల జంగారెడ్డి తెలిపారు.

నిరంతర ఆదాయ పంటలపై దృష్టిపెట్టాలి



కూరగాయల సాగులో రైతులకు మెళకువలు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

త్రిపురారం: రైతులు నిరంతరం ఆదాయాన్ని ఇచ్చే పంటల సాగుపై దృష్టి పెడితేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కంపాసాగర్ సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ అన్నారు. కేవీకే ఆధ్వర్యంలో జిల్లాలోని కిష్టాపురం, ఐలాపురం, బీటీ తండా, గుంటిపల్లి, నీలాయిగూడెం గ్రామాలకు చెందిన పలువురు రైతులను గురువారం హైదరాబాద్‌లోని జీడిమెట్లలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (విజిటేబుల్ అండ్ ఫ్లవర్)కేంద్రంలో కూరగాయలు, పూల తోటల సాగుపై అధ్యయనానికి తీసుకెళ్లామని తెలిపారు. వివిధ పంటల సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో సాయి ప్రియ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులపై కేసు నమోదు

వలిగొండ: తనిఖీలకు వచ్చిన ఆహార భద్రత అధికారులను అడ్డుకున్న దుకాణదారులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేందర్‌లాల్ తెలిపారు. గురువారం వలిగొండ మండల కేంద్రంలోని హోటల్స్, కిరాణ దుకాణాలు, బేకరీల్లో ఉమ్మడి జిల్లా ఆహార భద్రత అధికారి జ్యోతిర్మయి, యాదాద్రి జిల్లా అధికారి స్వాతి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మణికంఠ కిరాణ దుకాణంలో తనిఖీల కోసం వెళ్లగా దుకాణ యజమాని చీకటిమల్ల నాగభూషణం, అతడికుమారుడు మణికంఠ అధికారులపై దుర్భాషలాడాడు. దీంతో తమ విధులకు ఆటంకం కలిగించారని, అనుమతులు లేకుండా కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారని అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగ అరెస్ట్

- నిందితుడి వద్ద 15 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

కోదాడ: బైక్‌లు చోరీ చేస్తున్న దొంగను గురువారం కోదాడ పట్టణ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ప్రకాశ్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం రంగాపురానికి చెందిన గుండు ఆంజనేయులుకు భార్యతో విభేదాలు రావడంతో ఆమెతో విడిపోయి జులాయిగా తిరుగుతూ బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అతడు కోదాడ పట్టణంలో 9, మునగాల పరిధిలో 1, నడిగూడెం పరిధిలో 1, అనంతగిరి పరిధిలో 2, హుజూర్‌నగర్ పరిధిలో 2 బైక్‌లు చోరీ చేశాడు. సూర్యాపేటలో ఓ వైన్స్ ముందు దొంగిలించిన పల్సర్ బైక్‌పై గురువారం కోదాడకు వచ్చి రంగా థియేటర్ సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా బైక్‌లు చోరీ చేస్తున్న విషయం ఒప్పుకున్నాడు. ఆంజనేయులును అరెస్ట్ చేసి అతడి వద్ద 15 బైక్‌లను స్వాధీనం చేసుకొని కోర్టుకు రిమాండ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దొంగను పట్టుకోవడంలో కృషిచేసిన పట్టణ సీఐ రాము, ఎస్. రామాంజనేయులు, సిబ్బంది శ్రీనివాసరావు, ఎల్లారెడ్డి, సతీష్‌ను డీఎస్పీ అభినందించారు.

ప్రభుత్వ అనుమతి లేని సిగరెట్ల పట్టివేత

సూర్యాపేట క్రైం: ప్రభుత్వ అనుమతి లేని సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. గురువారం సీఐ తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట పట్టణంలోని కూరగాయాల మార్కెట్ రోడ్డులో భోనగిరి రవికుమార్ కిరాణ షాపులో కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ అనుమతి లేని సిగరెట్లు అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. రవికుమార్‌తో పాటు షాపులోని రూ.13440 విలువ గల సిగరెట్లను పట్టుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళ అదృశ్యం



లావణ్య

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని మాసుకుంట గ్రామానికి చెందిన పోతరాజు లావణ్య జనవరి 30వ తేదీ రాత్రి తన భర్త స్వామి తాగి వచ్చి ఇబ్బంది పెట్టాడని మరుసటిరోజు తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తమ్ముడు రత్నపురం సుమన్ గురువారం భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపారు. లావణ్య గురించిన వివరాలు తెలిస్తే 8712662472, 8712662733 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

'స్మైల్'తో 59 మంది బాల కార్మికులకు విముక్తి

- ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: జనవరి నుంచి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్–10 కార్యక్రమం ద్వారా 59 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు జిల్లా ఎస్పీ చందనా దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలలను పనిలో పెట్టుకున్న 49 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తప్పిపోయిన, నిరాదరణకు, వెట్టిచాకిరీకి గురవుతున్న బాలకార్మికులను గుర్తించి వారిని సంరక్షించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. పరిశ్రమలు, ఇటుకల తయారీ, హోటళ్లు, కిరాణ, బైక్ మెకానిక్ తదితర షాపుల్లో బాల కార్మికులను పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

మట్టపల్లి క్షేత్రంలో పూజలు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో చేశారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించారు. శ్రీస్వామి అమ్మవార్లను పట్టువస్త్రాలతో వధూవరులుగా ముస్తాబు చేశారు. అనంతరం ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రక్తిగట్టించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

బీజేపీ మతతత్వ విధానాలను తిప్పికొట్టాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

హాలియా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హాలియా పట్టణంలోని పెన్షనర్ల భవనంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాల వల్ల కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్ట స్థాయికి చేరాయని, పేదల వాస్తవ ఆదాయం 11 శాతానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం కార్పొరేట్ల పరం చేస్తుందని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చెల్లిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర 50 శాతం ఉండేలా చట్టబద్ధత కల్పించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రోజుకు 8గంటలు పని విధానం ఉండగా.. దానిని 12గంటలు చేసేలా బీజేపీ ప్రభుత్వం చట్టాలు తీసుకొస్తుందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల శ్రమను దోచుకుంటూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కున్‌రెడ్డి నాగిరెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, నాయకులు ఎస్‌కే బషీర్, కొత్త శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను గడపగడపకు తీసుకెళ్లాలి

- 'గావ్ చలో అభియాన్' ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ పల్నాటి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్నాటి వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్: కేంద్ర ప్రభుత్వ పథకాలతోపాటు సాధించిన విజయాలను గడపగడపకూ తీసుకెళ్లాలని గావ్ చలో అభియాన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ పల్నాటి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో నిర్వహించిన గావ్ చలో అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అదే విధంగా ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఓటరు వద్దకు తీసుకెళ్లాలని తెలిపారు. ప్రతి గ్రామానికి, వార్డుకు ప్రత్యేకంగా ఇన్‌చార్జీని నియమిస్తామన్నారు. సదరు ఇన్‌చార్జ్ నిరంతరం అందుబాటులో ఉండి ప్రజలకు చైతన్యం చేయాల్సి ఉంటుందని చెప్పారు. నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త శ్రమించాలని కోరారు. పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి తక్షణమే పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు పార్టీ నాయకులు శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఊడుగు వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టెలికాం అడ్వయిజరీ బోర్డు మెంబర్ రమనగోని శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, పంతంగి లక్ష్మణ్‌రావు, దాసోజు భిక్షమాచారి, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్‌డేషన్‌కు బారులు



ఆధార్‌లో మార్పులు, చేర్పుల (అప్‌డేషన్)తోపాటు రేషన్ కార్డు ఈకేవైసీ చేయించుకునేందుకు జనం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. తాజాగా గురువారం నల్లగొండలోని మున్సిపల్ మీసేవ కేంద్రం తెరవక ముందే జనం తమ చంటిపిల్లలతో సహా వచ్చి ఇలా బారులుదీరి కనిపించారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నలగొండ

ఎంజీయూలో వివిధ శాఖల అధికారుల మార్పు

ఎంజీయు (నల్లగొండ రూరల్): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో వివిధ శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ గురువారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ట్స్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు కొప్పుల అంజిరెడ్డిని సోషల్ సైన్స్ డీన్‌గా, రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకురాలు వసంతను ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా గణిత శాస్త్ర అధ్యాపకుడు ఉపేందర్‌రెడ్డిని, ఐక్యూఏసీ డైరెక్టర్‌గా మిర్యాల రమేష్‌ను, ఆడిట్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా సురేష్‌రెడ్డిని, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కోఆర్డినేటర్‌గా ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకురాలు జయంతిని నియమించారు. గత పాలక మండలిలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న వివిధ శాఖల అధికారులను మార్పులు చేయాలని పాలక మండలి సభ్యులు కోరారు. అయితే గత 8 నెలలుగా పాలక మండలి సమావేశం జరగలేదు. ఈ నెల మొదటి వారంలో పాలక మండలి సమావేశం జరుగనుండటంతో వివాదాలకు తావులేకుండా మార్పులు చేసినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం ప్రతి మూడునెలలకోసారి పాలక మండలి సమావేశం జరగాల్సి ఉంది.

పారదర్శకంగా రేషన్ పంపిణీ చేపట్టాలి



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

కేతేపల్లి: ఎలాంటి అవకతవకలకు తావులేకుండా రేషన్ సరుకుల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం కేతేపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినెలా దుకాణంలో రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ, మిగులు సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. రేషన్‌కార్డు లబ్ధిదారుల ఈకేవైసీ అప్‌డేట్‌కు ఈనెల 28 వరకు చివరి అవకాశం ఉందన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, డీటీ సీఎస్ జ్యోతి, డీటీ దివ్య, రేషన్ డీలర్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు పి.సత్తిరెడ్డి, డీలర్లు కె.వెంకట్‌రెడ్డి, ఎ.పద్మ, సీహెచ్.అంబిక, మురళి, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఫెవిక్విక్ ప్యాకెట్లు సీజ్

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని వెంకటలక్ష్మి కిరాణం, నవత కిరాణం షాపుల్లో గురువారం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి నకిలీ ఫెవిక్విక్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నకిలీ ఫెవిక్విక్ పాకెట్లు విక్రయిస్తున్న సత్యనారాయణ, రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపేందుకు భార్య యత్నం

- పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

శాలిగౌరారం: ప్రియుడితో కలిసి భర్తను చంపేందుకు భార్య యత్నించిన ఘటన శాలిగౌరారం మండలం తిరుమలరాయునిగూడెంలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలరాయునిగూడేనికి చెందిన టేకుల రవికి అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామానికి చెందిన ఉప్పల స్వప్నతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. రవి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా శాలిగౌరారం గ్రామ పంచాయతీ పరిధి బాలిశెట్టిగూడేనికి గండమల్ల భరత్‌తో స్వప్న కొంత కాలంగా వివాహేతర కొనసాగిస్తోంది. ఈ విషయం తెలిసి గతంలో రవి పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించాడు. అయినప్పటికీ రవి, స్వప్న వివాహేతర సంబంధం కొనసాగిస్తూనే ఉన్నారు. బుధవారం రాత్రి ఇంట్లో భార్యాపిల్లలతో కలిసి రవి నిద్రిస్తుండగా భరత్ ఇంట్లోకి చొరబడ్డాడు. గాఢ నిద్రలో ఉన్న రవిని చంపేందుకు భరత్, స్వప్న పథకం పన్నారు. భరత్ దిండుతో రవి ముఖంపై అదిమిపెట్టగా.. స్వప్న భర్త కాళ్లపై కూర్చొని మర్మాంగాలను నొక్కిపట్టింది. ఊపిరాడక రవి మేల్కొని స్వప్నను కాళ్లతో తన్నడంతో పక్కనే నేలపై పడుకున్న కుమారులపై ఆమె పడటంతో వారు నిద్రలేచారు. ముఖంపై దిండును తొలగించేందుకు రవి ప్రయత్నిస్తుండగా భరత్ అతడిని కొట్టడంతో రవి దవడ పళ్లు విరిగిపోయాయి. రవి కుమారులు కేకలు వేయడంతో పక్కింట్లో ఉన్న రవి తమ్ముడు, బాబాయి ఇంట్లోకి వస్తుండగా గమనించిన భరత్, స్వప్న అక్కడి నుంచి పారిపోయారు. రవిని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం సాయంత్రం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భరత్, స్వప్నపై కేసు నమోదు చేశామని, నిందితులిద్దరు పరారీలోనే ఉన్నారని ఎస్ఐ తెలిపారు.